ఘనంగా హరీష్ రావు పుట్టిన రోజు వేడుకలు


కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్‌బీనగర్: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు జన్మదిన వేడుకలను బుధవారం ఎల్‌బీనగర్‌లో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ యూత్ ఇన్‌చార్జి మాధవరం నర్సింహారావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కావేటి రమేష్, బొమ్మిడి ప్రవీణ్‌రెడ్డి, హరీష్‌రావు, కొట్ట ప్రశాంతరావు,చేగోరి భాస్కర్, మేకల శ్రీకాంత్, శివ, రఘుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

చాదర్‌ఘాట్: పండుగలను అన్ని వర్గాల ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మమురారి అన్నారు. ఈనెల 7న నిర్వహించనున్న బక్రీద్ పండుగకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో బాగంగా స్టేషన్ పరిధిలో ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు బక్రీద్ పర్వదినాన్ని శాంతియుతంగా జరుపుకుని హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడుకోవాలని కోరారు. ఎలాంటి పుకార్లు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ భరత్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్యాచ్‌పిట్స్ నిర్మాణంలో నాణ్యత డొల్ల

మలక్‌పేట: జీహెచ్ఎంసీ చేపట్టిన క్యాచ్‌పిట్స్ మరమ్మతు పనుల్లో నాణ్యత కొరవడింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేస్తూ 'మమ' అనిపిస్తున్నారు. మూసారంబాగ్ డివిజన్, రత్నం బస్తీలైన్‌లో ఇటీవల క్యాచ్‌పిట్‌లకు మరమ్మతులు చేపట్టారు. క్యాచ్‌పిట్ లోపల నిర్మించిన సిమెంట్ ఇటుకల గోడ నాణ్యత లేని కారణంగా పగుళ్లు వచ్చి కుంగిపోతున్నాయి. పలు దఫాలుగా మరమ్మతులు చేసినా ఇదే పరిస్థితి. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించడం లేదని, ప్రజాప్రతినిధులు, అధికారులు దీనిపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నా. సంబంధిత కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తోడేటి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పుర పరిధిలోని రావిర్యాలలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు మార్కింగ్ చేసి, మంజూరుపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు అధికారులు అశోక్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి, వ్యాపార లైసెన్స్‌లు పొందాలి

మున్సిపల్ కమిషనర్ వాణి

తుక్కుగూడ: వ్యాపారం ఉన్న ప్రతి ఒక్కరూ లైసెన్స్‌ను పొందాలని మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి సూచించారు. మంగళవారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా పుర కేంద్రంలోని వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అదేవిధంగా పరిసరాల పరిశుభ్రత, వీధికుక్కల పట్టివేత, వరద కాల్వల శుభ్రం తదితర కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈ గుణాకర్, ఆర్ఓ సామిక్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ మల్లేశ్, ఈఈ ప్రశాంత్, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యగిరి ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాగణంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం..

- మంత్రి శ్రీధర్‌బాబు
- మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం
- పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం


మల్లికార్జుననగర్‌లో పార్కును ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో మధుయాష్కీగౌడ్, కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

చంపాపేట: తమది మాటల ప్రభుత్వం కాదని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే చేతల ప్రభుత్వమని రాష్ట్ర ఐటీ శాఖామంత్రి, ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం ఆయన చంపాపేట డివిజన్ మాధవనగర్ కాలనీలో సంక్షేమ సంఘ భవనం, రూ.11 కోట్లతో సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్సీ దయానంద్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, ఎంపీ ఈటల రాజేందర్, స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో నెలకొన్న సమస్యలను రాజకీయాలకు అతీతంగా ప్రాధాన్యతాక్రమంలో దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. గత పాలకులు చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ అభివృద్ధిని గాడిలో పెడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన కేంద్ర నిధులు సకాలంలో అందితే అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందన్నారను. జన సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మౌళిక సదుపాయాలు, అవసరాలు కూడా పెరుగుతాయని అందుకు అనుగుణంగా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ...దివంగత మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఎన్నికలప్పుడే రాజకీయాలు ఉండేవని ఎన్నికల అనంతరం రాజకీయాలకు అతీతంగా కక్ష సాధింపులు లేకుండా అన్ని రంగాలలో అభివృద్ధి సాగేదన్నారు. మళ్లీ ఆ సంస్కృతి రావాలని ఆశించారు. నిబద్ధతతో కూడిన ప్రజా నాయకుడికి పదవులు శాశ్వతం కాదని ప్రజాసేవే పరమావధిగా భావించే వ్యక్తిత్వమే ముఖ్యమన్నారు. త్వరలో బైరామల్ గూడ చెరువు సుందరీకరణకు ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మీ, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, నాయకులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, ప్రకాష్‌గౌడ్, శ్రీనివాసరెడ్డి, పోరెడ్డి రవీందర్‌రెడ్డి, సద్ది సందీప్‌రెడ్డి, రమేష్, దశరథగౌడ్, పాశం శ్రీశైలం, వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

వనస్థలిపురం డివిజన్‌లో..

ఎల్‌బీనగర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్ కాలనీలో రూ. 58 లక్షలతో అభివృద్ధి చేసిన పార్కును స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. మల్లికార్జుననగర్, జహంగీర్‌నగర్‌లలో రూ. 62 లక్షలతో చేపట్టనున్న రోడ్డు, డ్రైనేజి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలు కాలనీల ప్రజలు తమ కాలనీల్లో సమస్యలను పరిష్కరించా లని కోరుతూ మంత్రికి వినతిపత్రాలు అందజేశారు.

కాలనీ అభివృద్ధికి నిధులు కేటాయించండి

ఎంపీకి సుభద్రానగర్ కాలనీవాసుల వినతి


ఎంపీ ఈటలకు వినతిపత్రం అందజేస్తున్న సుభద్రానగర్ కాలనీ నాయకులు

వనస్థలిపురం: తమ కాలనీలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని సుభద్రానగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు స్థానిక కార్పొరేటర్ కల్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి మంగళవారం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌కు వినతి పత్రం అందజేశారు. కాలనీలో 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన మంచినీటి పైప్‌లైన్ వ్యవస్థ ప్రస్తుత జనాభాకు సరిపోవడం లేదని, నూతన మంచినీటి పైప్‌లైన్ కోసం తగిన నిధులు మంజూరు చేయాలని ఎంపీని కోరారు. కార్యక్రమంలో లక్ష్మణ స్వామి, హరగోపాల్, మూర్తి, సుబ్రహ్మణ్యం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్ఐ సర్వే ఆధారంగా ఆస్తిపన్ను వసూలు చేయాలి

చాదర్‌ఘాట్: నగర కమిషనర్ ఆదేశాల మేరకు జీఎస్ఐ సర్వే ఆధారంగా ఆస్తిపన్ను వసూలు చేయాలని మలక్‌పేట సర్కిల్–6 డిప్యూటి కమిషనర్ జయంత్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన మలక్‌పేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రెండు కేటగిరిల్లో సర్వే ఆధారంగా రివిజన్ చేసి ఆస్తిపన్ను వసూలు చేయాలన్నారు. సర్కిల్–6లో కొత్త భవనాలు నిర్మాణాలు జరుగుతున్నా ఆస్తిపన్ను జాబితాలోకి రావడం లేదని వాటిపై దృష్టి సారించాలని అధికారులకు ఆదేశించారు. జీఎస్ఐ సర్వే ఆధారంగా కొత్త భవనాలను గుర్తించి వాటికి అసెస్‌మెంట్ చేయాలన్నారు. చాలా భవనాల్లో వ్యాపారాలు కొనసాగుతున్నాయని, వాటిని గుర్తించి వాణిజ్య ఆస్తిపన్ను వసూలు చేయాలని సూచించారు. ట్రేడ్ లైసెన్సులను వసూలు చేయాలని బిల్ కలెక్టర్లకు తెలియజేశారు. కార్యక్రమంలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్


వికాస్‌నగర్ వద్ద కుంగిన మ్యాన్‌హోల్

చైతన్యపురి: నడి రోడ్డులో ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్స్ కుంగిపోతున్నాయి. నాసిరకం పనుల కారణంగా తరచూ మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. చైతన్యపురి డివిజన్ గౌతంనగర్ నుంచి హనుమాన్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై మ్యాన్‌హోల్ కుంగిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదు. మ్యాన్‌హోల్ సైజు పెద్దగా ఉండటం వల్ల వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్ హోల్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

భూలక్ష్మీనగర్, తిరుమలహిల్స్,గడ్డిఅన్నారం, కళ్యాణ్‌నగర్, రెవిన్యూబోర్డ్ కాలనీ, నారాయణ కాలేజ్, ఏపీఏయూ కాలనీ, వెంకటేశ్వర కామర్స్ కాలేజ్, ఇండస్ ల్యాండ్ బ్యాంక్, వాణి జ్యువిహార్, నలందా కాలేజ్, బిగ్ సీ, అజంత కాలనీ, ప్రిన్స్ బాడీగార్డ్ లేన్, రేస్‌కోర్స్ రోడ్, పీస్ కాలనీ, మూసారాంబాగ్, జ్ఞాన్‌దీప్ టవర్, రాజరాజేశ్వరీ టెంపుల్, ఎస్‌బీహెచ్ బ్యాంక్, ఎస్‌బీఐ కాలనీ పార్క్, ఆండాళ్ నిలయం, డీబీఆర్ డయాగ్నస్టిక్ సెంటర్, తనిష్క్ జెవెలర్స్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉదయం 9 గంటల నుంచి 10:30 వరకు...

గణేష్ టెంపుల్, సలీంనగర్, హీరోహోండా షోరూం బ్యాక్‌సైడ్, రామాలయం స్ట్రీట్, రామచంద్రా ఐటీఐ, ఇంద్రసేనారెడ్డి పీటీ, శ్రీపురం కాలనీ రోడ్ పరిసర ప్రాంతాలు.

ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు...

గురుదాస్, సలీంనగర్, రామారావ్ కంపెనీ, పద్మావతీ అపార్ట్‌మెంట్స్, సలీంనగర్ గణేష్ టెంపుల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు...

కరణ్‌బాగ్, జీఏ పార్క్, శ్రీనివాస కమ్యూనిటీ హాల్, రామాలయం, పద్మావతి కళ్యాణ మండపం, సాయిరాం కాలనీ, ఎస్‌బీహెచ్ కాలనీ, హనుమాన్ టెంపుల్, మనోరమ ఐటీఐ, పంచ ఫార్మా, అడ్డగుట్ట, పోచమ్మ టెంపుల్, ద్వారకా నివాస్, ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ, న్యూహనుమాన్ టెంపుల్, ప్రతాప్ నగర్, భాష్యం స్కూల్, ఎంసీహెచ్ కాలనీ, రేస్‌కోర్స్ రోడ్, లైబ్రరీ పీటీ, వాణి స్కూల్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని డీఈ తెలిపారు.

తడి, పొడి చెత్తను వేరుగా వేయాలి

కమిషనర్ జ్ఞానేశ్వర్

మీర్‌పేట: తడి, పొడి చెత్తను వేరుగా చేసి మున్సిపల్ వాహనాల్లో వేయాలని మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళికలో భాగంగా 45వ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీధికుక్కల నియంత్రణతో పాటు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. పట్టణంలో వ్యాపార అనుమతులు లేని షాపులను గుర్తించడంతో పాటు ప్రణాళికపై ఆటో ద్వారా ప్రచారం చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అక్కి మాధవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, పర్యావరణ ఇంజినీర్ రాము తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు..

టమోటా రూ.17, వంకాయ రూ.23, బెండ రూ.45, పచ్చి మిర్చి రూ.40, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.50, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.35, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.20, గోకరకాయ రూ.45, దోసకాయ రూ.18, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.75, చామగడ్డ రూ.35, మునగ రూ.75, కందగడ్డ రూ.45, బీట్‌రూట్ రూ.19, కీర రూ.35, బీన్స్ రూ.115, క్యాప్సికమ్ రూ.57.

ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



హుడాకాంప్లెక్స్: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి సూచించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజారోగ్యం, పారిశుద్ధ్యంపై మంగళవారం సర్కిల్ అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరకాలనీ, శ్రీనివాసకాలనీ, సరూర్‌నగర్ ఓల్డ్ విలేజ్, పోచమ్మబాగ్, కుమ్మరిబస్తీ, బాపునగర్, భగత్‌సింగ్‌నగర్, జైస్వాల్ కాలనీల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టి కాలనీల్లోని రోడ్లను, ఖాళీ ప్రదేశాలను ప్రత్యేక వాహనాల ద్వారా శుభ్రం చేయించారు. ఇళ్లతో పాటు వాణిజ్య సముదాయాల్లోని చెత్తా చెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయడంతో నాలాలు, మురికి కాల్వలు నిండి దుర్వాసన, దోమలు వృద్ధి చెంది వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రతి ఒక్కరూ చెత్తను వాహనాల్లో వేయాలని సూచించారు. కార్యక్రమంలో పారిశుద్ధ్యం డీఈ చందన చౌహాన్, శానిటరీ సూపర్‌వైజర్ బుచ్చయ్య, ఎస్ఎఫ్ఏలు, జవాన్లు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న డీసీ యాదయ్య, కార్పొరేటర్ చింతల అరుణ

నాగోలు: కాలనీల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అన్నారు. మంగళవారం నాగోలు డివిజన్ పరిధిలోని అరుణోదయ కాలనీ రోడ్ నెంబర్ 8 లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ యాదయ్య, జీహెచ్ఎంసీ అధికారులు, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్‌తో కలిసి కాలనీలో తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని కాలనీలల్లో చెత్త చెదారం లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించి కాలనీలో ఎక్కడ డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల సమస్య, దోమల నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మత రాజకీయాలే బీజేపీ విధానం

మన్సూరాబాద్: దేశంలో బీజేపీ మతతత్వ రాజకీయాలకు పాల్పడుతూ ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తోందని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. మంగళవారం మన్సూరాబాద్ డివిజన్ ఇందిరానగర్ కాలనీలో గణేష్‌గౌడ్ అధ్యక్షతన సీపీఎం హయత్‌నగర్ సర్కిల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ భారతదేశం సెక్యులర్ రాజ్యమని, సెక్యూలర్ విధానాలకు భిన్నంగా పాలకులు మత విధానాలను అనుసరిస్తున్నారన్నారు. ఉగ్రవాదులను అంతం చేసేందుకు చేపట్టిన ఆపరేస్ సింధూర్‌ను అమెరికా ఆదేశాల మేరకు నిలిపివేసి భారత సార్వభౌమాధికారాన్ని అమెరికాకు తకట్టుపెట్టారని ఆరోపించారు. చర్చలకు సిద్ధమన్న మావోయిస్టులతో చర్చలు జరుపకుండా ఆపరేషన్ కగార్ చేపట్టి అనేక మంది మావోయిస్టులను మట్టుబెట్టారన్నారు. సాహెబ్‌నగర్ కలాన్‌లోని 71, 162 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ స్థలంలో ఎల్‌బీనగర్‌లోని పేదలందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 30 న చలో కలెక్టరేట్ ధర్నాకు పేదలందరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్కిల్ కార్యదర్శి కీసరి నర్సిరెడ్డి, తిరుమల, సంధ్య, భాస్కర్, మల్లేషం, లింగంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి


సైదాబాద్‌లో స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

సైదాబాద్: కాలనీలు, బస్తీలవాసులు తమ పరిసరాలు పరిశ్రుభ్రంగా ఉంచుకోవాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆమె సైదాబాద్ డివిజన్‌లో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్‌ను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సైదాబాద్ డివిజన్ పరిధిలోని ప్రధాన, అంతర్గత రహదారులపై పరిశుభ్రత నెలకొల్పేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎక్కడా చెత్త, చెదారం పేరుకు పోకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సైదాబాద్‌లోని అన్ని ప్రాంతాల్లో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ కోసం కార్మికులకు స్థానికులు సహకరించాలని కార్పొరేటర్ కోరారు. కార్యక్రమంలో మలక్‌పేట సర్కిల్–6 డిప్యూటి కమిషనర్ జయంత్, సర్కిల్ ఏఎంహెచ్ఓ రుద్ర శ్రీనివాస్, దేవేందర్, నాగరాజు, కళ్యాణ్ పాల్గొన్నారు.

బీజేపీ కుర్మగూడ డివిజన్ కమిటీ ఎన్నిక


వివరాలను సహదేవ్‌యాదవ్‌కు అందజేస్తున్న నాయకులు

చంచల్‌గూడ: భారతీయ జనతా పార్టీ కుర్మగూడ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు యుగేందర్ తెలిపారు.ఈ మేరకు మంగళవారం ఆయన కమిటీ వివరాలను పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్‌కు అందజేశారు. ఉపాధ్యక్షులుగా ఆర్. వసంత, కె. ప్రవీణ్, ఎన్. నాగరాజు, రాజ్‌పాల్ యాదవ్, ప్రధాన కార్యదర్శులుగా యాట ప్రమోద్, దర్శనం ప్రదీప్, కార్యదర్శులు ఎన్. వాణి, బి. మహేందర్, శశికాంత్‌యాదవ్, డి. మనీష్, కోశాధికారిగా జి. శోభ, కార్యవర్గ సభ్యులుగా విశ్వనాథ్, శ్యామ్‌ప్రసాద్, రంగనాథ్, అనిల్‌యాదవ్, మహేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు ఉగాది మహేష్, వెంకట్‌రెడ్డి, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

మూసారంబాగ్‌లో తిరంగా యాత్ర


తిరంగా యాత్రలో పాల్గొన్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, బీజేపీ నాయకులు

మలక్‌పేట: ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాల నేపథ్యంలో మంగళవారం మూసారంబాగ్ బీజేపీ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ దుగ్యల్, ప్రతినిధి ప్రకాశ్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ పాల్గొన్నారు. సలీంనగర్ యూసీవో బ్యాంకు సబ్ రోడ్డు నుంచి ప్రారంభమైన యాత్ర మూసారంబాగ్ చౌరస్తా, ఆండాళ్ నిలయం, కోణార్క్ టవర్స్ మీదుగా దిల్‌సుఖ్‌నగర్ మారుతీ మందిర్ వరకు కొనసాగింది. నాయకులు, కార్యకర్తలు తిరంగా జెండాలు పట్టుకొని ప్రధాని మోదీకి మద్దతుగా భారత్ మాతా కు జై అంటూ నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛ నిచ్చి ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ మెడలు వంచిందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సుభాష్ చందర్, రమేష్ రెడ్డి, దేవేందర్, సురేందర్, ప్రవీణ్, రంజిత్, గణేష్, తులసి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకే 'బడిబాట'

సైదాబాద్ జోన్ డిప్యూటీ ఈవో రాధాకృష్ణ



మలక్‌పేట: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది అడ్మిషన్లు పెంచేందుకు 'బడిబాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సైదాబాద్ జోన్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ తిరునగరి రాధాకృష్ణ తెలిపారు. గతంలో చేపట్టిన ప్రత్యేక ప్రణాళికతో సత్ఫలితాలు సాధించామని, పదో తరగతిలో 96 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. జోన్ పరిధిలోని అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. 17 పాఠశాలలో ఏఐ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 6 నుంచి చేపట్టనున్న 'బడిబాట' కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల్లో వసతులు, నాణ్యమైన విద్యా బోధనపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజులను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అధిక ఫీజులు వసూలు చేసే పాఠశాలలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు తల్లిదండ్రులు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, సదరు పాఠశాలలను గుర్తించి నోటీసులు జారీ చేశామన్నారు. పాఠశాలలు ప్రారంభమైన తర్వాత తనిఖీలు చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనలను అతిక్రమించి ప్రైవేట్ పాఠశాలల్లో యూనిఫాం, పుస్తకాలు, విద్యా సామగ్రి విక్రయించకుండా ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇప్పటికే పాఠశాలలకు యూనిఫాం పంపిణీ చేశామని, 37 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల్లో యూనిఫామ్ పంపిణీకి సిద్ధంగా ఉందన్నారు. సైదాబాద్–1లో 1374 మంది బాలబాలికలకు యూనిఫాం అందజేస్తామన్నారు. తొలి విడతగా ఒక జత దుస్తులు, పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేసేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల్లో వసతులు, విద్యాబోధనపై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తామని, ఉచిత పుస్తకాలు, యూనిఫాం, కంప్యూటర్ విద్య, ఆటలు, పాటలు, యోగాలో శిక్షణ, మధ్యాహ్న భోజనం అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని అవగాహన కల్పించనున్నట్లు ఆయన వివరించారు.